ఫ్లవర్ మార్కెట్‌తో.. చెట్లకు చేటు..!

- జీకేవీకే ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- ఏళ్ల నాటి చెట్లు కనుమరుగయ్యే ప్రమాదం
- వ్యతిరేకిస్తున్న శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు, ప్రజలు
- పోరాటానికి కార్యాచరణ


జీకేవీకే ముఖద్వారం

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిద్యాలయం అంటే కొత్త రకం చెట్లను, వంగడాలను ప్రయోగాల ద్వారా రూపొందించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చే కీలకమైన విధి. ప్రతి చెట్టును శాస్త్రవేత్తలు ప్రత్యేకంగానే చూస్తారు. ఎందుకంటే ఆ చెట్టుద్వారా అంటుకట్టే ప్రయోగాలు చేస్తారు. ఇలా ఏళ్ల తరబడి పెరిగిన చెట్ల ద్వారా కొత్తరకం చెట్ల సృష్టికి ఇదే కీలకంగా ఉంటుంది. అయితే హెబ్బాళలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం (జీకేవీకే) ప్రాంగణంలో బాగల్కోటె ఉద్యాన యూనివర్సిటీకి అనుగుణంగా ఫ్లవర్ మార్కెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 10 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించారు. అధికారుల తీర్మానంపై వ్యవసాయశాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, జీకేవీకేలో అగ్రికల్చర్ అనుబంధమైన కోర్సులు చేస్తున్న విద్యార్థులతోపాటు వివిధ వర్గాల ప్రజలనుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఫ్లవర్ మార్కెట్‌కు ఉద్దేశించిన స్థలం పరిశోధనా కార్యకలాపాలు సాగే స్థలంగా ఉంది. ఇక్కడ ఏళ్ల తరబడి పెంచిన గోడంబి, కొబ్బరి, మహాగని, పనస, చక్కేతతోపాటు వివిధ రకాల 942 చెట్లు ఉన్నాయి. అరుదైన చెట్లు ఉండే ఈ ప్రదేశాన్ని వాణిజ్యపరమైన అవసరాలకు వినియోగించుకోవాలనే ప్రయత్నం సాగుతోంది. తద్వారా పరిశోధనలకు, క్యాంపస్ కార్యకలాపాలకు తీవ్రమైన నష్టం కలగనుందని పర్యావరణ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

● శతాబ్దకాలానికిపైగా నగరానికి ఆహ్లాదకరం, ఆనందాన్నిచ్చే లాల్‌బాగ్ పరిధిలో సొరంగ మార్గం ఏర్పాటు చేయాలని బెంగళూరు నగరాభివృద్ధిశాఖ భావిస్తోంది. ఈ విషయంలో బీజేపీ ప్రజాప్రతినిధులు తీవ్రమైన అభ్యంతరం తెలిపారు. లాల్‌బాగ్‌లో నిర్మాణాలకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాకర్స్‌తోపాటు ఇతరులనుంచి భారీగా సంతకాల సేకరణ ప్రక్రియ సాగింది. లాల్‌బాగ్‌లో సొరంగమార్గం ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని పలువురు పర్యావరణవేత్తలు, సస్యకాశిగా పేరొందిన లాల్‌బాగ్‌ను పాడుచేసే ఆలోచనలు విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వివాదం ఇంకా సాగుతూనే ఉంది. అంతలోనే జీకేవీకే పరిధిలో 10 ఎకరాల స్థలం ఫ్లవర్ మార్కెట్‌కు కేటాయించాలనే నిర్ణయాన్ని అన్నివర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. అభివృద్ధి పేరిట పర్యావరణాన్ని నాశనం చేసేలాంటి ఆలోచనలు ఎంతవరకు సమంజసమని పర్యావరణ శాస్త్రవేత్తలు ప్రశ్నిస్తున్నారు. జీకేవీకే వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాగల్కోటె ఉద్యానవన విశ్వవిద్యాలయం అధ్యాపకులు, విద్యార్థులు కూడా వ్యతిరేకిస్తుండడంతో పోరాటానికి సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

● ప్రస్తుతం ఫ్లవర్ మార్కెట్ ఏర్పాటుకు గుర్తించిన స్థలంలో సంపూర్ణంగా పరిశోధనా కార్యకలాపాలకు రిజర్వు చేసింది. పుష్కరకాలంగా ఎంఎస్సీ, పీహెచ్‌డీ విద్యార్థులు, వివిధ ప్రయోగాలు చేస్తున్నారు. సీజన్లవారీగా పంటల పెరుగుదల, దిగుబడి, ఎగుమతులకు చేసే వంగడాలను పరిశీలించి అంటు కట్టడం ద్వారా కొత్త మొక్కలను రైతులకు పంపిణీ చేస్తారు. పంటలసాగు విధానాలను ప్రత్యక్షంగా శిక్షణలు, చైతన్యం కల్పిస్తారు. విద్యార్థులకు శిక్షణతో పాటు రైతులకు ప్రయోగాలను స్వయంగా చూసి అవగాహన పొందేందుకు అవకాశం కల్పిస్తారు. ఇటువంటి పరిశోధనా స్థలాన్ని కేటాయించే విషయంలో ఆత్రుత చూపడం మరిన్ని విమర్శలకు కారణమవుతోంది. ప్రభుత్వం నుంచి హార్టికల్చర్ యూనివర్సిటీపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ ఏడాది జనవరిలోనే ప్రారంభమైన ఉత్తర ప్రత్యుత్తరాల వ్యవహారం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ స్థలం కాకుండా మరోచోటు ఎంపిక చేయాలని ఉన్నా, ఉద్యానవన యూనివర్సిటీ మాత్రం సదరుస్థలంపై పట్టుబడుతోంది.

ప్రస్తుతం మార్కెట్‌ను నిర్మించదలిచిన స్థలంలో పరిశోధనా కార్యకలాపాలకు రిజర్వు చేయబడింది. ఫ్లవర్ మార్కెట్ ఏర్పాటు చేస్తే కళాశాల పరిసరాలు, అధ్యయనానికి ఉండే విధానాలకు అడ్డుకానుంది. ఉద్యానవనశాఖ రైతు స్నేహిగా ఉండాల్సి ఉన్నా విరుద్ధంగా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కళాశాలకు అనుబంధంగా ఉండే జీవవైవిధ్యత పరిసరాలకు అభ్యంతరం కానుంది. 300 దుకాణాలు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ పెరిగి క్యాంపస్ ఉన్న ప్రశాంత వాతావరణానికి భంగం కలగనుంది. 1976లో చెట్ల చట్ట ప్రకారం పరిశోధన కార్యకలాపాలు కొనసాగే లేదా జీవవైవిధ్యత ప్రాంతంగా గుర్తించిన స్థలాన్ని ఇతర వాటికి వినియోగించరాదు. ఈ విషయం తెలిసినా ప్రభుత్వం ఇదే స్థలం కోసం పట్టుబడుతోంది. ఫ్లవర్ మార్కెట్‌కు ఎవరి అభ్యంతరం లేదు కానీ కళాశాలకు ఉన్న ప్రశాంతతను వేలాదిమంది వ్యవసాయ శాస్త్రవేత్తలు, సాంకేతిక పరికరాలు రూపొందించిన పరిశోధకులకు ఇది ఏమాత్రం ఇష్టంలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఫ్లవర్ మార్కెట్ ఏర్పాటుకు సంబంధించి స్థానికులు పరిశోధనా స్థలంలో మార్కెట్ నిర్మాణం సరికాదని యలహంక ఎమ్మెల్యేకు సమస్య వివరించారు. ఎమ్మెల్యే స్పందించి ఉద్యానవన కార్యదర్శితోపాటు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌లకు లేఖలు రాసి ఈ ప్రయోగాన్ని మరోచోటుకు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యానవిశ్వవిద్యాలయం పరిశోధనా స్థలాన్ని వ్యాపార, వాణిజ్యపరమైన అంశాలకు వినియోగించుకునే ప్రస్తావనను వ్యతిరేకిస్తూ 'సేవ్ జీకేవీకే క్యాంపస్' ప్రత్యేకమైన పోరాటాన్ని రూపొందించారు. ఇటీవల ప్రారంభమైన ఆన్‌లైన్ పోరాటంలో ఇప్పటివరకు 20వేలమందికిపైగా సంతకాలు చేసి సదరు స్థలాన్ని ఫ్లవర్ మార్కెట్‌కు కేటాయించరాదని డిమాండ్ చేస్తున్నారు.

ఫ్లవర్ మార్కెట్ వస్తే తొలగించాల్సిన చెట్ల వివరాలు

మామిడి	307
గోడంబి	292
సిల్వర్ ఓక్	150
కొబ్బరి	58
పనస	50
మహాగని	30
ఇతర చెట్లు	55


ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

మనువాదులను గుర్తించండి: సీఎం

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలోని రాజ్యాంగ వ్యతిరేక మనువాదులను గుర్తించాలని సీఎం సిద్దరామయ్య అన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బెంగళూరు వసంతనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో రాజ్యాంగ దినోత్సవం-2025ను ప్రారంభించి మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగం ఏర్పడక ముందు దేశంలో మనుస్మృతి అమలులో ఉండేదన్నారు. మనుష్య వ్యతిరేక విధానాలు, సమానత్వాన్ని వ్యతిరేకించే నియమాలకు అవకాశం లేకుండా రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించారన్నారు. సమసమాజ నిర్మాణం, అసమానత నివారణ లక్ష్యంగా రాజ్యాంగం ఉందన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు మనం కట్టుబడి సమాజం కోసం పాటుపడదామన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగపీఠికను ప్రతిజ్ఞ చేయించారు. మంత్రులు మహదేవప్ప, కేహెచ్ మునియప్ప, సుధాకర్, న్యాయ సలహాదారుడు ఏఎస్ పొన్నణ్ణ, రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

2028లో అధికారమే లక్ష్యం

- గ్రూపులు లేవు... సమష్టి నాయకత్వం
- డీసీఎం డీకే శివకుమార్


రాజ్యాంగ దినోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 2028లో మళ్లీ పార్టీ అధికారంలోకి తెచ్చేందుకు సతీశ్‌జార్కిహొళితో కలసి చర్చలు జరిపినట్టు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. సీఎం స్థానం కంటే పార్టీని మళ్లీ అధికారంలోకి తేవడమే ప్రధానమన్నారు. కేపీసీసీ కార్యాలయంలో బుధవారం జాతీయ రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ అధ్యక్షుడినని, సతీశ్ జార్కిహొళి పార్టీ కార్యాధ్యక్షుడని ఇద్దరి మధ్యా ఆత్మీయ స్నేహం ఉందన్నారు. తామిద్దరం ఒకే క్యాబినెట్‌లో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. సతీశ్‌జార్కిహొళి పార్టీకి పెద్ద ఆస్తిలాంటివారన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్ల అయ్యిందని, ఇక మిగిలిన సమయంలో ఏమేం పనులు చేపట్టాలని చర్చలు జరిగాయన్నారు. ఇంతకుమించి వేరే చర్చలు సాగలేదన్నారు. కాంగ్రెస్‌లో ఎలాంటి గ్రూపులు లేవని, అంతా కాంగ్రెస్ గ్రూప్ అంటూ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తమది సమష్టి నాయకత్వమని, పార్టీ బలోపేతానికి తాను ఒక్కడినే కష్టపడలేదన్నారు. మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో సిద్దరామయ్య, ఇతర ఎమ్మెల్యేల సహకారంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామన్నారు. కాగా ముఖ్యమంత్రి పదవిపై ఉన్న గందరగోళానికి పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు.

సీఎం కుర్చీ గొడవలో ముందుకు సాగని క్రస్ట్‌గేట్ల పనులు

- ప్రతిపక్ష నేత ఆర్ అశోక్

బళ్లారి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల ప్రతిపాదన రాజకీయ కుర్చీ పోరులో ఇరుక్కుపోయిందని కర్ణాటక ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేక క్రస్ట్‌గేట్ల పనులు నిలిచిపోతున్నాయని అన్నారు. బుధవారం ఆనకట్ట వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనులపై ఆయన ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 33 గేట్లలో ఇప్పటివరకు 16 మాత్రమే వచ్చాయన్నారు. ఈ నెమ్మదితో వచ్చే వర్షాకాలానికి గేట్లు అమర్చేలా కనిపించడంలేదు అన్నారు. ఈ పనులకు జలవనరుల శాఖకు కూడా నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య వెంటనే డ్యాం వద్దకు వచ్చి పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పదవి కీచులాటల్లో పనులు జరుగుతాయనే నమ్మకం కలగడం లేదని అన్నారు. ముందుగా పార్టీ సమావేశంలో అశోక్ మాట్లాడుతూ రెండో పంటకు రాష్ట్ర ప్రభుత్వం నీరు ఇవ్వక రైతలను కష్టాల్లోకి నెట్టిందని, ఎకరాకు రూ.25వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పేరుకు మాత్రమే సీఎం: ప్రస్తుతం రాష్ట్రంలో పేరుకు మాత్రమే సిద్ధరామయ్య సీఎంగా ఉన్నారని, అభివృద్ధి పనులు పూర్తిగా స్తంభించాయని విరుచుకుపడ్డారు. బీజేపీ పోరాటం కారణంగా ఒక కళంకిత మంత్రి రాజీనామా చేశాడని, 14 నివేశనాలు రద్దు అయ్యాయని చెప్పారు. రాబోయే రోజుల్లో పార్టీ పోరాటం మరింత ఉగ్రరూపం దాలుస్తుందని హెచ్చరించారు. ఈశాన్య అధ్యాపక నియోజకవర్గాన్ని బీజేపీ వరుసగా గెలుచుకుంటూ వస్తోందని ఈసారి కూడా దానిని కాపాడుకునేందుకు తగిన అభ్యర్థిని ఎంపిక చేసి నివేదిక ఇవ్వనున్నామని అశోక్ వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నళిన్‌కుమార్, ఎమ్మెల్యే ఒగ్గొడ్డణ్ణగౌడ్, ఎమ్మెల్సీ రవికుమార్, ఎమ్మెల్యే కృష్ణనాయక్ పాల్గొన్నారు.


తుంగభద్ర డ్యాం వద్ద పనులను పరిశీలిస్తున్న అశోక్, బీజేపీ నాయకులు


ప్రసంగిస్తున్న నాదబ్రహ్మ హంసలేఖ, వేదికపై కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ సత్యనారాయణరాజు

తీరప్రాంత ప్రజల బతుకును మార్చిన కెనరా బ్యాంకు

- కన్నడ రాజ్యోత్సవంలో నాదబ్రహ్మ హంసలేఖ

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు కర్ణాటక హృదయానికి దగ్గరైన సంస్థ అని ప్రత్యేకించి కరావళి (తీర) ప్రాంత ప్రజల బతుకును మార్చిందని ప్రముఖ సంగీత దర్శకులు, నాదబ్రహ్మ డాక్టర్ హంసలేఖ అన్నారు. నగరంలోని కెనరాబ్యాంకు ప్రధాన కార్యాలయంలో 70వ కన్నడ రాజ్యోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హంసలేఖ పాల్గొని మాట్లాడుతూ ఆర్థిక వ్యవహారాలకే పరిమితం కాకుండా విద్య, పరిశ్రమ, మహిళా స్వావలంబనతోపాటు, సామాన్య ప్రజల అభివృద్ధికి కెనరాబ్యాంకు సదా మద్దతు ఇచ్చిందన్నారు. బ్యాంకు ఎండీ సీఈఓ కే సత్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరదీప్‌సింగ్ అహ్లువాలియా, నూతనంగా నియమితులైన ఈడీ సునీల్‌కుమార్ ఛఘ్, సీవీఓ నబీన్‌కుమార్ వేదికపై ఆసీనులయ్యారు. ఇదే సందర్భంగా కన్నడ సాహిత్య, సాంస్కృతిక రంగాలలోనూ, బ్యాంకు అభివృద్ధిలో శ్రమించిన కెనరాబ్యాంకు రిటైర్డు ఉద్యోగులను ఆత్మీయంగా సత్కరించారు. సీనియర్లు గోపాలకృష్ణ పై, కేఎస్ రవీంద్రనాథ్ తదితర ప్రముఖులను సన్మానించారు. అధ్యక్షత వహించిన ఎండీ సీఈఓ సత్యనారాయణరాజు మాట్లాడుతూ కన్నడభాష మన సంస్కృతికి ఆధారమన్నారు. కన్నడిగులకు సేవ అందించడం కెనరా బ్యాంకుకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక పోటీల విజేతలైన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. బ్యాంకు జనరల్ మేనేజర్ ఆర్.రాజేశ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్‌కుమార్, కెనరాబ్యాంకు కన్నడ సంఘం అధ్యక్షులు, జనరల్ మేనేజర్ రామానాయక్ పాల్గొన్నారు.

అధిష్ఠానం చేతిలో సీఎం సిద్దరామయ్య భవితవ్యం

9

- ముఖ్యమంత్రిని ఉంచడమా.. దించడమా..?
- కాంగ్రెస్ కమిటీలో భిన్నాభిప్రాయాలు

ట్రాక్టర్, లారీ ఢీ.. ఇద్దరి మృతి


దెబ్బతిన్న ట్రాక్టర్

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 75పై బెంగళూరు శివారులోని నెలమంగల తాలూకా మల్లరబాణవాడి క్రాస్ వద్ద బుధవారం ఉదయం ట్రాక్టర్‌ను లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రమేశ్ (35), ప్రేమ్‌కుమార్ (34) మృతిచెందాడు. గుడేమారనహళ్ళికి చెందిన వీరు ట్రాక్టర్‌లో జాతీయ రహదారిపై మలుపు తిరుగుతుండగా లారీ ఢీకొంది. ప్రమాదం ధాటికి ట్రాక్టర్ చక్రాలు దెబ్బతిన్నాయి. అశాస్త్రీయంగా ట్రాక్టర్ రోడ్డు యూటర్న్ చేయడమే ప్రమాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు. ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఘటనా స్థలాన్ని నెలమంగల ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

కుక్కెలో వైభవంగా రథోత్సవం


రథోత్సవంలో భక్తజన సంద్రం

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని దక్షిణకన్నడ జిల్లాలో ప్రముఖ నాగారాధన క్షేత్రమైన కుక్కె సుబ్రహ్మణ్యలో బుధవారం విశేషపూజలు నిర్వహించారు. చంపకషష్ఠి పేరిట ఇక్కడ ఉత్సవాలు నిర్వహించారు. పెద్దరథంలో సుబ్రహ్మణ్యస్వామిని, చిన్నరథంలో ఉమామహేశ్వరులను కొలువుదీర్చారు. రథోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలలనుంచి భక్తులు తరలివచ్చారు. వివిధ కళాబృందాలు మేళతాళాలతో సాగుతుండగా గజరాజు వెంట రాగా రెండురథాలు మెల్లగా కదలసాగాయి. భక్తుల హరోహర, సుబ్రహ్మణ్య నినాదాలతో కుక్కె మార్మోగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టిబందోబస్తు పర్యవేక్షించారు.

వీవీపురంలో...

బెంగళూరు వీవీపురంలోని సజ్జన్‌రావ్ సర్కిల్‌లో ప్రముఖమైన సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం విశేషపూజలు జరిగాయి. మూలవిరాట్టుకు ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తిని వెండిరథంపై ఉంచి ఊరేగించారు. నగరం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు రథోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చారు. నగరంలోని ఇతర ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కొనసాగాయి.


బెంగళూరు సజ్జన్‌రావ్ సర్కిల్‌లో వెండిరథంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యస్వామి

సోషలిస్టు పాలనతోనే దేశ పురోగతి

ప్రజాహక్కులను నెరవేరిస్తేనే అభివృద్ధి

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఘనంగా రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు



కవాతు నిర్వహిస్తున్న రెడ్‌షర్ట్ వలంటీర్లు, సీపీఎం నాయకులు



ప్రసంగిస్తున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

అనంతపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సోషలిస్టు పాలనతోనే దేశం పురోగతి వైపు అడుగులు వేస్తుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. ప్రథమ సోషలిస్టు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి క్లాక్‌టవర్ మీదుగా లలితకళాపరిషత్ వరకు రెడ్‌షర్ట్ వలంటీర్స్ కవాతు నిర్వహించారు. అనంతరం పరిషత్ ఆవరణలో పలువురు కళాకారులు ఎర్రజెండా పాటలకు నృత్యాలతో అలరించారు. తదనంతరం 'సోషలిజం ఔన్నత్యం - సామ్రాజ్యవాద ప్రమాదం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో బీవీ రాఘవులు మాట్లాడారు. సోషజలిజంతో ఎంత మేలు జరుగుతుందనే దానికి రష్యా నిదర్శనమన్నారు. రష్యాలో విద్య, వైద్యం, ఉపాధి వంటివి అందరికీ నాణ్యమైన పద్ధతిలో సమాన హక్కుగా ఉండగా... భారతదేశంలో మాత్రం ఆరోగ్యాన్ని, విద్యను వ్యాపారం చేయడంతోపాటు ప్రభుత్వ భూములను అమ్మి సొమ్ము చేసుకునే పాలకులున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ బడాబాబులకు వత్తాసు పలికేవారే తప్ప.. సామాన్య ప్రజలు, కార్మికులు, రైతాంగానికి న్యాయం చేసే పాలకులు కనిపించడలేదన్నారు. జబ్బులురాని మంచినీరు కూడా లభించని దౌర్భాగ్య సమాజంలో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. దేశ మహిళల్లో రక్తహీనత ప్రభావం ఎక్కువగా ఉందనీ, ఇలా మరే దేశంలోనూ లేదని పేర్కొన్నారు. ప్రజల హక్కులైన నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన ఉచిత వైద్యం, సొంత ఇల్లు, ఉద్యోగం, వృద్ధులకు పింఛన్, వ్యవసాయం చేసే ప్రతిఒక్కరికీ భూమి తదితరాలను నెరవేర్చినపుడే దేశం అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. వ్యవస్థలోని సమస్యలన్నింటిపై ప్రభుత్వంతో పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

మహిళలకు భద్రత ఏదీ: రాంభూపాల్

మహిళలు, యువతులు బయటకు వెళ్తే ఇంటికి క్షేమంగా తిరిగొస్తారా.. లేదా.. అనే అభద్రత నడుమ బతుకుతున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. రూ.లక్షలు వెచ్చించి పిల్లలను చదివిస్తే వారికి ఉద్యోగం వస్తుందనే నమ్మకం కూడా లేదని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మోసాలు, దౌర్జన్యాలు చేసినవారే రాజ్యాధికారం చేపడుతుండడం బాధాకరమన్నారు. దేశానికి కావాల్సింది మత తత్వం కాదు, మత సామరస్యం అన్నారు. కేంద్రంలో 11 సంవత్సరాలుగా బీజేపీ అధికారంలో ఉండి ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని తెలిపారు. కార్పొరేట్లకు మద్దతుగా కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోనూ రైతాంగం అనేక సమస్యలతో కుదేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పాలకుల్లో స్పందన లేదన్నారు. జిల్లాలో అరటి ధర పడిపోవడంతో పంటను ఏమీ చేసుకోలేక బాధాతప్త హృదయాలతో రైతులు పంటను దున్నేసుకుంటున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.40వేల కోట్లు రావాల్సుండగా ఇప్పటి వరకు రూ.12వేల కోట్లు మాత్రమే సాధించుకోగలిగారన్నారు. వైసీపీ అధినేత రోడ్ల మీదకు వచ్చి హడావుడి చేయడమే తప్ప... కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించడం లేదన్నారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే తనకు ఏమౌతుందో తెలుసు కాబట్టే జగన్ బీజేపీని ప్రశ్నించే ధైర్యం చేయట్లేదని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం.. మావోయిస్టులను పిట్టల్ని కాల్చేసినట్లు కాల్చేస్తే సీపీఎం సహించదని హెచ్చరించారు. వారితో శాంతియుతంగా చర్చలు జరిపాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ... పాలకవర్గాల విధానాలు ప్రజల పాలిట ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. జిల్లాలో వేల ఎకరాల్లో భూములు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోవడం ద్వారా వ్యవసాయం తగ్గిపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదం అంతరించిపోయే దశకు చేరుకుంటున్న ఈ తరుణంలో దేశ రక్షణకు సోషలిస్టు పాలన తప్ప.. ప్రత్యామ్నాయం లేదన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం రాష్ట్ర నేత ఓబులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, ఆర్‌వీ నాయుడు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు

● కారు, కంటైనర్ ఢీ.. ఇద్దరి మృతి

● మృతులు శ్రీసత్యసాయి జిల్లావాసులు



నుజ్జయిన కారు

ములకలచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి వెళ్లి.. బంధువులతో కలిసి సంతోషంగా గడిపారు.. ముహూర్తం చూసుకుని కారులో తిరిగి వస్తుండగా అంతలేనే మృత్యువు కబళించింది. ముంబై-చెన్నై జాతీయ రహదారిలో కారు, కంటైనర్ ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం సాపిరెడ్డిగారిపల్లెకు చెందిన చాపిరెడ్డి వెంకటరమణ (65), చాపిరెడ్డి రాజశేఖర్ (40) ఇద్దరూ బంధువులు. కొన్నేళ్లుగా ఇరు కుటుంబాలు మదనపల్లెలో నివాసముంటున్నాయి. సీవీ వెంకటరమణ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొంది చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. సీవీ రాజశేఖర్ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం తవళంలో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి కారులో వెళ్లారు. బుధవారం ఉదయం ముహూర్తం చూసుకుని తిరిగి కారులో మదనపల్లెకు బయలు దేరారు. ఈ క్రమంలో వేపూరికోట వద్ద కారు, కంటైనర్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందారు. మృతదేహాలు కారులోనే ఇరుక్కుపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంలో అతికష్టం మీద బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ వెంకటేశులు, ఎస్‌ఐ నరసింహుడు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



నారాయణ స్వామి (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద ముష్టూరు గ్రామ కౌలు రైతు నారాయణస్వామి(40) అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణస్వామి తన తల్లి పేరిట ఉన్న రెండు ఎకరాలు, కౌలు పొలం ఐదు ఎకరాలలో మిరప, వేరుశనగ, కంది పంటలను సాగు చేసేవాడు. మూడేళ్ల నుంచి పంట నష్టపోవడంతో అప్పులు రూ.10 లక్షల దాకా పేరుకుపోయాయి. వాటిని తీర్చే మార్గం లేక ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి, ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రైతుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తుతెలియని వ్యక్తి దేహం

కదిరి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గూడ్స్ షెడ్ సమీపాన గల చింత చెట్టుకింద ఓ వ్యక్తి మృతిచెంది ఉండడంతో స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని, పరిశీలించారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటుందని సీఐ తెలిపారు. తెలుపు టీషర్టు, నలుపురంగు కాటన్ ప్యాంటు ధరించినట్లు చెప్పారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీసు స్టేషన్‌లోగానీ, 9440796851 నంబరులో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు



జుజారు మణి (ఫైల్)

ధర్మవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మరణించిన ఓ వ్యక్తి నేత్రదానం చేసి ఇద్దరికి వెలుగులు నింపారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన జుజారు మణి(40) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో విశ్వదీపాసేవాసంఘం సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, వారి అంగీకారం మేరకు నేత్ర వైద్య నిపుణుల సహకారంతో కంటి కార్నియా సేకరించారు. నేత్రదానానికి అంగీకరించిన మృతుడి భార్య లక్ష్మి, కుమారులు కార్తీక్, దినకర్, సోదరులు జుజారు తాయప్ప, తాయేంద్ర, రఘులకు విశ్వదీపాసంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వదీపాసేవాసంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, సంఘం పట్టణ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జుజారు రఘు, నాగార్జున, ఆదినారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నా ఇష్టం వచ్చినప్పుడు ఇస్తా..!

తహసీల్దార్ దురుసు ప్రవర్తన.. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన బాధితుడు

నల్లచెరువు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'ఆఫీస్ నుంచి మర్యాదగా బయటికిపో. నాకు ఇష్టం వచ్చినప్పుడు ఇస్తా' అని తహసీల్దార్ దురుసుగా ప్రవర్తించాడని ఎమ్మెల్యే కందికుంటకు ఫిర్యాదు చేసినట్లు ఓ బాధితుడు తెలిపాడు. కె.పూలకుంట సచివాలయంలో దామలవాండ్లపల్లికి చెందిన మల్లికార్జున తన కుటుంబ సభ్యుల పేరు మీద పొజిషన్ సర్టిఫికెట్ కోసం గత నెల 31న దరఖాస్తు చేసుకున్నాడు. గ్రామ సర్వేయర్ ద్వారా ఇంటి స్థలాన్ని సర్వేచేయించుకొని సర్వే పత్రాలు సైతం తహసీల్దార్ కార్యాలయానికి అందజేసినట్లు తెలిపాడు. వీఆర్‌ఓ లాగిన్‌కి ఈ నెల 13న మార్చారు. అప్పటి నుంచి ప్రతి రోజు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని, పత్రాలన్నీ సరిగా ఉన్న తహసీల్దార్ లాగిన్‌లో ఆమోదించలేదని మల్లికార్జున ఫిర్యాదులో పేర్కొన్నాడు. హౌసింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30వరకే గడువు ఉండటంతో బుధవారం కార్యాలయానికి వచ్చి పొజిషన్ సర్టిఫికెట్ గురించి తహసీల్దార్‌ను అడిగానన్నారు. దీంతో తహసీల్దార్ ఆఫీస్ నుంచి బయటకు వెళ్లు అంటూ దురుసుగా ప్రవర్తించాడని బాధితుడు మల్లికార్జున ఎమ్మెల్యేకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన ఫిర్యాదును కదిరిలో ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేసినట్లు తెలిపాడు. ఈ విషయమై తహసీల్దార్ జమానుల్లాఖాన్‌ను వివరణ కోరగా ఆఫీస్‌లో గట్టిగా మాట్లాడవద్దని, అలా మాట్లాడేవారు ఎవరైనా ఉంటే బయటకు వెళ్లాలని చెప్పినట్లు పేర్కొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా లక్ష్మీప్రసాద్ ప్రమాణం

హాజరైన మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు



ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు

అనంతపురం క్రైం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన చల్లా లక్ష్మీప్రసాద్‌బాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలో ఏపీఐఐసీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్, తోటి డైరెక్టర్లతో కలిసి అనంతపురానికి చెందిన చల్లా లక్ష్మీప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, అనంతపురం, మడకశిర ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు హాజరయ్యారు. చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. లక్ష్మీప్రసాద్ బాబుకు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ....తన గెలుపునకు చల్లా లక్ష్మీప్రసాద్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయనకు డైరెక్టర్ పోస్టు దక్కడం, ప్రమాణ స్వీకారానికి తాను హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ఏపీఐఐసీ గతంలో కంటే భిన్నంగా పనిచేస్తోందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీకి భారీగా పరిశ్రమలు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో ఏపీఐఐసీ మరింత మెరుగ్గా పనిచేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కృష్ణాజలాలతో బంగారు పంటలు

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

బుక్కపట్నం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాలలో రైతులు బంగారు పంటలు పండించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆకాంక్షించారు. హంద్రీనీవా కాలువ ద్వారా బుక్కపట్నం చెరువుకు కృష్ణాజలాలు వదులుతున్నారు. చెరువు పూర్తిగా నిండి, మరువపోతోంది. దీంతో బుధవారం చెరువు కట్టపై ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి జలహారతి ఇచ్చారు. తూముల ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బుక్కపట్నం చెరువు 0.5 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యంతో జలకళ సంతరించుకుందన్నారు. చెరువు కింద ప్రత్యక్షంగా 3 వేల ఎకరాలు, పరోక్షంగా మరో 10 వేల ఎకరాలు ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం అన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణాజలాలతో నింపుతామన్నారు. బుక్కపట్నం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డీపీఆర్ తయారు చేయాలని బాబా శతజయంతి వేడుకలకు విచ్చేసిన సందర్భంగా కలెక్టర్‌కు ఆదేశించడం హర్షణీయమన్నారు. చెరువులో జంగిల్ క్లియరెన్స్ పనులు ఉచేపట్టి, కొండవైపు దేవాలయానికి రోడ్డు నిర్మిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి.. స్లూయిజ్ గేట్ ఎత్తి, ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులు సంజీవరాయుడు, టీడీపీ మండల కన్వీనర్ మల్లిరెడ్డి, టీడీపీ నేతలు గంగాధర్, సామకోటి ఆదినారాయణ, కొత్తచెరువు కన్వీనర్లు రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బుక్కపట్నం సింగిల్ విండో అధ్యక్షుడు చెన్నకృష్ణ, మాజీ సర్పంచ్ యశోదరాయుడు, లావణ్య పాల్గొన్నారు.

హంద్రీనీవా జలాలతో రైతుల్లో ఆనందం



హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

నంబులపూలకుంట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా మండలంలో చెరువులు కృష్ణా జలాలతో నింపడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలోని పడమరనడింపల్లి, గౌకనపేటలో బుధవారం అధికారులు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరైతు చూసి నా ఆనందం వ్యక్తం చేశారు. మూడు చెరువులకు నీరు వచ్చిందని.. ఖరీఫ్, రబీలో పంటలు సాగుచేయడానికి అనుకూలంగా ఉంటుందని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా కరువుతో సతమతమయ్యామన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌తో గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా అనుకూలంగా ఉండే చెరువులను నింపుకుంటూ తలుపుల మండల మీదుగా ఎన్పీకుంటలోని చెరువులు నింపుతున్నట్లు వారు పేర్కొన్నారు. చెరువులకు నీటిని నింపడంతో బీళ్లు సైతం సాగుచేసుకుని జీవిస్తామని, రైతులు ఇక ఎక్కడికి వలసలు వెళ్లాల్సిన అవసరంలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పట్టణాలకు వలసలు వెళ్లారు. వారు స్వగ్రామాలకు వచ్చి పంటలు సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం పొలం పిలుస్తోంది. పొలంబడి, క్లస్టర్ డెమో, మట్టినమూనా సేకరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. రైతులకు సరిపడే యూరియాను కొరత లేకుండా సరఫరా చేస్తోందన్నారు. ఏడు రోజులపాటు జరిగే రైతన్న మీకోసం కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రైతులు విజయ్‌కుమార్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

శభాష్ కుసుమ..!

కిలిమంజారో పర్వతారోహకురాలిని అభినందించిన సీఎం



సీఎం చంద్రబాబుకు చిత్రపటం అందజేస్తున్న కుసుమ

శింగనమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'కుసుమ..శభాష్..! ఇదే పట్టుదలతో నీవు కృషి చేస్తే తప్పకుండా ఎవరెస్ట్ ఎక్కుతావు. నీకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది' అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. నార్పల మండల దుగ్గుమర్రికి చెందిన కుసుమ ఇటీవల ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె తన కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. పర్వతారోహణ అనంతరం అక్కడ తీసుకున్న ఫొటోను ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అండగా ఉంటుందని, కుసుమ పట్టుదల చూస్తే ఎవరెస్టు పర్వతాన్ని తప్పకుండా అధిరోహిస్తుందనే నమ్మకం కలుగుతోందన్నారు. కుసుమకు భవిష్యత్తులో అన్నివిధాలుగా అండగా ఉంటామని ఆమెకు ఆల్‌దిబెస్ట్ చెప్పారు.

చట్టాలకు మూలాధారం.. రాజ్యాంగం

జడ్పీ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలోని చట్టాలన్నింటికీ మూలాధారం రాజ్యాంగమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ ప్రశాంతంగా జీవించగలుగుతున్నారంటే అది రాజ్యాంగం గొప్పతనం అన్నారు. అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, వాటిలోని విశిష్టమైన అంశాలను తీసుకుని దేశ ప్రజలకు ఉపయోగపడేలా ప్రతిష్టాత్మకంగా అప్పట్లో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓలు ప్రభాకర్, తేజోత్స్న, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జున, శ్రీవాణి, మాధవి, అరుణకుమారి పాల్గొన్నారు.

'వద్ది'కి పదవి

అఖిల భారత పద్మశాలి సంఘం తిరుపతి అన్నసత్రం అధ్యక్షుడిగా ఎంపిక



తాడిపత్రి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పద్మశాలి సంఘం తిరుపతి అన్నసత్రం అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని తాడిపత్రికి చెందిన వద్ది శివసత్యనారాయణ పేర్కొన్నారు. తిరుపతిలో బుధవారం జరిగిన అఖిల భారత సేవా కమిటీ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ధర్మకర్త, జనరల్ సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంటి పదవులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అన్నసత్రం అధ్యక్షుడి పదవి రావడం ఎంతో గర్వకారణమన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10 టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువు డిసెంబరు 10వరకు పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం తెలిపారు. జిల్లాలో సెయింట్ మేరీ బాలికల ఎయిడెడ్ ఉన్నత పాఠశాల (అనంతపురం)లో ఎస్‌ఏ బయాలజీ, ఎస్‌ఏ తెలుగు, ఎల్‌పీటీ తెలుగు, ఎల్‌పీటీ హిందీ, పీఈటీ పోస్టులు ఉన్నాయన్నారు. ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్(అనంతపురం)లో ఐదు ఎస్టీటీ పోస్టులు ఉన్నాయన్నారు. మహిళలే అర్హులన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు గడువు బుధవారంతో ముగిసిందన్నారు. దానిని డిసెంబరు 10 వరకు పొడిగించామన్నారు.

పది పరీక్షల ఫీజు గడువు సైతం..

పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగించనట్లు డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. డిసెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు అపరాధ రుసుంలేకుండా ఫీజు కట్టవచ్చన్నారు. 11 నుంచి 12 వరకు రూ25 అపరాధ రుసుంతో, 15వరకు రూ.50 ఫైన్‌తో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు.

ట్యాలీ ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి: నిరుద్యోగ యువతకు బెంగళూరులో ఉచితంగా కంప్యూటర్ ట్యాలీ కోర్సులో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఉంటుందన్నారు. డిసెంబరు 1 నుంచి 35రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే ఉచిత శిక్షణలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

నేడు జైళ్లశాఖ ఐజీ రాక

బుక్కరాయసముద్రం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలుకు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసులు రానున్నట్లు ఇన్‌చార్జ్ జైలు సూపరింటెండెంట్ వసంతకుమార్ తెలిపారు. జైలులో గురువారం నిర్వహిస్తున్న వేలం పాటలో ఆయన పాల్గొననున్నట్లు తెలిపారు. జైలుకు సంబంధించి 36 ఎద్దులు, 1600 చింత చెట్లు, 400 సపోటా చెట్లకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపైనే శిక్షణ

జడ్పీ డిప్యూటీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రధాన అంశంగా డీడీఓలకు శిక్షణ ఇచ్చారని జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎంపీడీఓ నుంచి ఇటీవల డివిజనల్ అభివృద్ధి అధికారి(డీడీఓ)గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన.. 15 రోజుల పాటు విజయవాడలో శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ ముగించుకుని వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రధాన అంశంగా శిక్షణ ఇచ్చారన్నారు. అందులో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నానన్నారు. వనరులను గుర్తించి, వాటి ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చడంపై శిక్షణ ఇచ్చారన్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఇంటి పన్ను ద్వారా సమకూరే సొమ్మును పూర్తిస్థాయిలో రాబడితే పంచాయతీలకు నిధుల కొరతే ఉండదన్నారు. మంచినీటి సరఫరాపై వివరించారని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య

అమరాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వలస గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త పూజ(26) జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ ఇషాక్‌బాష తెలిపారు. వివాహమై ఆరేళ్లయినా పిల్లలు కలుగకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాజీమార్గంలోనే కేసుల పరిష్కారం

అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇరు కక్షిదారులు రాజీమార్గంలో కేసులు పరిష్కరించడమే లక్ష్యమని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. బుధవారం కోర్టు ఆవరణంలో మెగా లోక్ అదాలత్‌పై అధికారులతో న్యాయవాదులు, పోలీసులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడం కోసం అందరూ సహకరించాలన్నారు. పోలీసులు తమ తమ పోలీస్‌స్టేషన్‌పరిధిలో రాజీ అయ్యే కేసులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. డిసెంబరు 13న జాతీయ మెగాలోక్ అదాలత్ జరుగుతుందని సాధ్యమైనంతమేర ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఏపీపీ నగేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, అబ్దుల్ కరీం, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


ముద్దాయికి జైలు శిక్ష

గుడిబండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం యర్రబల్లి గ్రామానికి చెందిన దారా రమేష్‌కు మడకశిర న్యాయాధికారి జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ రాజకుల్లాయప్ప తెలిపారు. గుడిబండ మండలం మద్దనకుంట గ్రామానికి చెందిన వీర హనుమక్క ఇంటిలో బంగారు గొలుసు దొంగతనం కేసులో అప్పటి ఎస్‌ఐ శరత్‌చంద్ర ముద్దాయి దారా రమేష్‌పై 2018లో కేసు నమోదుచేశారు. కోర్టులో కేసురుజువు కావడంతో ముద్దాయికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

త్రైలింగస్వామి (జయంతి)



త్రైలింగస్వామి 1607 నవంబరు 27న విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో జన్మించారు. అసలు పేరు శివరాముడు. స్వామి గణపతిగా పేరొందారు. హిందూ ధార్మిక యోగిగా గొప్ప శక్తులున్నాయని ప్రతీతి. (త్రైలంగ స్వామి, తెలంగ్ స్వామిగా పేరొందారు) అతీంద్రియ శక్తి కారణంగా వారణాసిలో ఆయన 280 సంవత్సరాలు జీవించారని భక్తులు విశ్వసిస్తారు. రామకృష్ణ పరమహంస ఆయనను 'వారణాసిలో నడిచే శివుడి'గా స్తుతించారు. 'ది వాకింగ్ శివ' పేరిట స్వామిజీ బయోగ్రఫీని బీరుదు రాజు రామరాజు వెలువరించారు. ప్రత్యేకించి బెంగాల్‌లో చిరస్మరణీయుడిగా నిలిచారు. ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా భక్తులున్నారు. గంగానదీతీరంలో 1887 డిసెంబరు 26న స్వామిజీ పరమపదించగా గంగా నదిలో సలిలసమాధి (సలిలం అంటే జలం) చేశారు.

ఉస్తాద్ సుల్తాన్ ఖాన్ (వర్ధంతి)



సారంగి వాద్యసంగీత కళాకారుడు పద్మభూషణ్ గ్రహీత ఉస్తాద్ సుల్తాన్ ఖాన్ 1940 ఏప్రిల్ 15న రాజస్థాన్ రాష్ట్రం సికార్ జిల్లాలో జన్మించారు. సికార్ ఘరానాకు చెందిన వీరు శాస్త్రీయ గాయనంలోనూ దిట్ట. 'తబలా బీట్ సైన్స్' అనే ఇండియన్ ఫ్యూజన్ గ్రూప్ సంస్థాపక సభ్యులు. తండ్రి ఉస్తాద్ గులాబ్ ఖాన్ నుంచి సారంగి నేర్చుకున్నారు. 20వ ఏట గుజరాత్‌లో ఆలిండియా రేడియా కళాకారుడిగా సేవలందించారు. పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ, గోల్డ్ మెడలిస్ట్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2011 నవంబరు 27న ముంబైలో కన్నుమూశారు.

ఓల్గా (పుట్టిన రోజు)



కలం పేరు 'ఓల్గా'తో పేరొందిన పోపూరి లలిత కుమారి ప్రముఖ తెలుగు రచయిత్రి. 1950 నవంబరు 27న గుంటూరులో జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ, సాహిత్య రంగపు చర్చల్లో స్త్రీవాద దృక్పథాన్ని ప్రవేశపెట్టిన రచయిత్రిగా ఆమెను గుర్తిస్తారు. స్త్రీవాద ఉద్యమానికి ప్రతీకగా నిలిచారు. ఓల్గా కథలు, నవలలు, పద్యాలు, మహిళా సాహిత్యం వీటిలో ప్రముఖమైనవి. తెనాలిలోని వీఎస్ఆర్ తెలుగు కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేశారు. సినీ రంగంలో ఉషాకిరణ్ సంస్థకు కథా రచయిత్రిగా పని చేసి మూడు చిత్రాలను నిర్మించారు. ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు పొందారు. 12 రచనలను, ఆమె కథల ఆంగ్ల అనువాదాలను 'అమెరికన్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్' అందుబాటులో ఉంచారు. 'విముక్త' కథల సంపుటికి ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం (రూ.25లక్షల రివార్డు) లభించాయి. ప్రస్తుతం అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్‌లో జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగమే పునాది

ఉత్సాహంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం

బంగారపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగమే పునాది అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ మహేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ ఉద్యానవనంలో తాలూకా బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి మాలార్పణ చేశారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమైన దేశంలో సోషలిస్ట్, లౌకిక, సోదర, సమానభావాలతో రాజ్యాంగం రూపొందించబడిందన్నారు. దేశాన్ని సార్వభౌమ, లౌకిక, సోషలిస్ట్ ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా రాజ్యాంగంలో పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ హోబళి అధ్యక్షుడు సంపంగిరెడ్డి, టీఏపీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, సీతారామప్ప, చౌడప్ప శశికుమార్, బీవీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం అర్థవంతంగా ఆచరించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. సీపీఎం తాలూకా కార్యదర్శి రఘురామరెడ్డి మాట్లాడుతూ ప్రజలచేత, ప్రజలకోసం అనే ఉద్దేశ్యంతో రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగ ఆశయాలకు భంగం కాకుండా పాలన సాగాలని అభిలషించారు. సీపీఎం జిల్లా సమితి సభ్యులు బిళ్ళూరు నాగరాజ్, తాలూకా సమితి సభ్యులు అశ్వత్థప్ప, డీటీ మునిస్వామి, జీ కృష్ణప్ప, రవణప్ప, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సర్జాపుర గ్రామ పంచాయతీలో...



బాగేపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో..

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా సర్జాపుర గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం అర్థవంతంగా ఆచరించారు. గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఎన్ వీణా మునియల్లప్ప మాట్లాడుతూ దేశంలోని ప్రతిపౌరుడికి సమానత్వం, మౌలిక హక్కులు, కర్తవ్యాలు మన రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగం యొక్క ప్రాధాన్యతను అందరూ అర్థం చేసుకోవాలన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులచే రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ మంజునాథ్ సర్జా, సభ్యులు ఎస్ఎం శ్రీనివాస్, మమతా రమేశ్, కలావతి మూర్తికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బంగారపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం



సర్జాపురలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఘాటిలో వైభవంగా షష్ఠి పూజలు

డిసెంబరు 25న బ్రహ్మరథోత్సవం - 10 నుంచి ఎద్దుల పరుష

దొడ్డబళ్లాపుర, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సుబ్రమణ్య షష్ఠిని పురస్కరించుకుని తాలూకాలోని పురాణ ప్రసిద్ధ ఘాటి క్షేత్రంలో బుధవారం విశేష పూజలు కొనసాగాయి. వేకువజామున 5 గంటలకు అభిషేకం, మహామంగళారతి జరిగింది. సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాకారోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. నాగారాధనకు పేరొందిన ఘాటి క్షేత్రంలో సుబ్రమణ్యషష్ఠి సందర్భంగా భక్తులు పుట్టలు, నాగదేవతలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వందలాదిమంది భక్తులు క్యూలో వచ్చి సుబ్రమణ్యస్వామి, లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు ప్రసాద వ్యవస్థ నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి పాల్గొన్నారు. మంత్రికి ఆలయం తరపున సాదర స్వాగతం లభించింది.

25న బ్రహ్మరథోత్సవం


ఘాటి సుబ్రమణ్యస్వామి బ్రహ్మరథోత్సవం డిసెంబరు 25న జరగనుంది. ప్రత్యేక పుష్పాలంకరణ, పూజలు ఉంటాయి. భక్తుల అనుకూలం కోసం క్యూలైన్‌లు, తాగునీరు, తాత్కాలిక వ్యవస్థ కల్పించనున్నారు. ఈసారి నిర్వహించే ఘాటి జాతరలో పశువులకు, భక్తుల వాహనాలకు సుంకం లేదు. సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులు, గర్భిణీలు, బాలింతలకు నేరుగా దర్శనానికి అవకాశం కల్పించనున్నారు.

పదిరోజులపాటు పరుష

డిసెంబరు 10 నుంచి 18 వరకు పరుష నిర్వహించనున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి ఆవులు, ఎద్దులు తీసుకురానున్నారు. రైతులు, పశువులకు నీటి వ్యవస్థ కల్పిస్తున్నారు. పశువులకు రోగాలు ప్రబలకుండా పశువైద్యులు పర్యవేక్షించనున్నారు. జాతరకు వచ్చే రైతులకు టిఫిన్, భోజనాన్ని ఆలయం తరపున కల్పించనున్నట్టు దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు.

సుద్దగుంటపాళ్యలో...

బొమ్మనహళ్ళి(ఆంధ్రజ్యోతి): సుబ్రమణ్యషష్ఠిని పురస్కరించుకుని బీటీఎం లేఅవుట్ సుద్దగుంటపాళ్యలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో బుధవారం విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. స్థానిక మాజీ కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త జీ మంజునాథ్ నేతృత్వంలో కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో గణపతిహోమం, శాంతిహోమం నిర్వహించారు. 9మంది అర్చకులతో ధార్మిక కైంకర్యాలు కొన సాగాయి. అనంతరం వందలాదిమంది భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మంజునాథ్ మాట్లాడుతూ ఇక్కడ స్వామివారు భక్తుల కొంగు బంగా రంగా ఉన్నారని, సర్పదోష నివారణ పూజలు ఇక్కడి ప్రత్యేకమన్నారు. ఇదే సందర్భంగా ఆలయ 18వ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. సాయంత్రం స్వామివారి పల్లకీ ఉత్సవం పురవీధులలో కొనసాగింది. దీపోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీటీఎం లే అవుట్, తావరకెరె, కోరమంగల, ఆడుగూడి, మడివాళ, బొమ్మనహళ్ళి తదితర ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవంలో మంత్రి రామలింగారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో ఘాటి సుబ్రహ్మణ్య స్వామి



సుద్దగుంటపాళ్యలో సుబ్రహ్మణ్య స్వామికి అలంకరణ



ఘాటిలో మంత్రి రామలింగారెడ్డికి సాదర స్వాగతం



సుద్దగుంటపాళ్యలో హోమంలో పాల్గొన్న భక్తులు

కెరీర్‌పై దృష్టి సారించండి

ఎన్‌సీసీ కేడెట్‌లకు కేఎల్ రావు సూచన

బెంగళూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని చక్కటి కెరీర్ కోసం ఇప్పటి నుంచే శ్రమించాల్సి ఉందని ఇండి యన్ బ్యాంకు మాజీ ఫ్యాకల్టీ కేఎల్ రావు పిలుపు నిచ్చారు. ఎన్‌సీసీ కేడెట్‌లకోసం నగరవ్యాప్తంగా ప్రత్యేక క్యాంప్‌లు కొనసాగు తున్నాయి. ఇందులో భాగంగా బృందావన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఏర్పాటైన క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్‌లను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థిదశయే కీలకమన్నారు. సరదాలకాసం కాలాన్ని వృథా చేస్తే మిగిలిన జీవితం ఎంతో క్లిష్టంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణకే ప్రాధాన్యత చాలదని, ఉన్నత వ్యక్తిత్వం కూడా అవసరమన్నారు. అప్పుడే చదివిన చదువుకు సార్థకత సాధ్యమన్నారు. క్రీడల్లోనూ, సాంస్కృతి కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం కావాలన్నారు. ఒక పౌరుడిగా సామాజిక బాధ్యతలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ పంకజ్ సిన్హా పర్యవేక్షించారు.



ప్రసంగిస్తున్న కేఎల్ రావు

ఎన్నికలు ఏకగ్రీవం

కంప్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని దరోజీ ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవమైంది. గతంలో ఉన్న అధ్యక్షుడు మంజునాథ్ తన పదవికి రాజీనామా చేయడంతో ఆస్థానానికి బుధవారం ఎన్నిక జరిగింది. సభ్యులుగా పీఎస్ లింగప్ప ఒక్కరే ఆస్థానానికి నామినేషన్ వేశారు. ఎవరూ పోటీలో లేకపోవడంతో ఆయనే ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నాగరాజు తెలిపారు. అనంతరం లింగప్ప మాట్లాడుతూ సొసైటీలో రైతులకు సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తానన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అనంతరం ఆయనను పలువురు అభినందించారు. ఉపాధ్యక్షుడు వలి, మసీదు కార్యదర్శి మల్లికార్జున, జనార్దన్, మాదాపూర్, మారెప్ప, సద్దాం తిమ్మరాజు, సోమశేఖర్, అంబన్న, రవి, రాముడు, రవి ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన మేయర్‌కు సన్మానం

బళ్లారిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహానగర పాలికె కార్యాలయంలో నూతన మేయర్ పూజారి గాదెప్పను ఘనంగా సన్మానించారు. అఖండ కర్ణాటక వాల్మీకి జిల్లా అధ్యక్షులు ఎర్రగుడి ముద్దమల్లయ్య, 30వ వార్డు కార్పొరేటర్ ఆసిఫ్ బాషా, ఎర్రగుడి రాజాతో పాటు వాల్మీకి సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా నిరసన

బళ్లారి సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమలు చేసిన నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు ఏఐయూటీయూసీ నాయకత్వంలో నగరంలోని రాయల్ సర్కిల్లో బుధవారం కార్మికులు నిరసన తెలిపారు. సంఘం జిల్లాకమిటీ కార్యదర్శి డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు కొత్త కార్మిక కోడ్‌లను అప్రజాస్వామికంగా అమలు చేసిందని విమర్శించారు. కార్మిక సంస్థలను సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుందన్నారు. పార్లమెంట్‌లో వీటికి వ్యతిరేకంగా ఏ ప్రతిపక్ష పార్టీ కూడా తన స్వరాన్ని వినిపించకపోవడం బాధాకరమన్నారు. కర్ణాటకలో కార్మిక కోడ్‌లను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. కార్మిక చట్టాలు స్థిరకాలిక ఉపాధిని అమలు చేస్తాయని, శాశ్వత ఉద్యోగాలను పూర్తిగా నాశనం చేస్తాయన్నారు. కార్మికులను పని నుంచి తొలగించడానికి నియామకం, తొలగింపు నియమాన్ని అనుసరిస్తారన్నారు. దీనిని వ్యతిరేకించాలన్నారు. కార్మిక వ్యతిరేక కోడ్ల గురించి తెలుసుకుని రాజీలేని పోరాటానికి సిద్ధం కావాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్‌గౌడ, శాంత, సురేశ్, శర్మ, కిరణ్‌కుమార్, హొన్నూరు, మురళీకృష్ణ, ప్రవీణ్, ఖాజాసాబ్, కార్మికులు పాల్గొన్నారు.

హొస్పేట్(ఆంధ్రజ్యోతి): చట్టాల పేరుతో కార్మికులను కట్టడి చేయవద్దని సీఐటీయూ నాయకులు అన్నారు. బుధవారం హొస్పేట్‌లో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ విజయనగర్ జిల్లా కమిటీ నాయకుడు మరడి జంబయ్య ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్మిక చట్టాల నోటిఫికేషన్ ప్రకారం ఈ చట్టాలకు నియమాలను రూపొందించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక సంఘాలు ఎట్టి పరిస్థితుల్లోను ఈ చట్టాలను అంగీకరించవన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు.



నిరసన తెలుపుతున్న ఏఐయూటీయూసీ నాయకులు

ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రోత్సహించాలి

● న్యాయాధికారి రాజేశ్ హొసమనె



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక అవసరాలున్న పిల్లలను ప్రోత్సహించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సాధికారతశాఖ, యువజన సాధికారత, క్రీడా శాఖ, దివ్యాంగుల కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వైద్య కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడలు, సాంస్కృతిక పోటీల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. దివ్యాంగ పిల్లల విజయాలను చూడటం అందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. వారు తమ విజయాలను ఉత్సాహంగా అంగీకరిస్తారు. వారికి విద్య ఇతర హక్కులను కల్పించడం ద్వారా వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు. ట్రామాకేర్ సూపరింటెండెంట్ శివనాయక్ మాట్లాడుతూ దివ్యాంగులు దేవుని బిడ్డలని అన్నారు. క్రీడలు శారీరక మానసిక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. ప్రతిభావంతులైన దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. దివ్యాంగులను జాగ్రత్తగా చూసుకునే ఉపాధ్యాయులు తల్లిదండ్రులను ఆయన హీరోలుగా అభివర్ణించారు. కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప, పునరవాస కేంద్రం సూపరింటెండెంట్ సుంకమ్మ, మానసిక వికలాంగుల రెసిడెన్షియల్ స్కూల్ ఛైర్మన్ మహేశ్‌కుమార్, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలం అమ్మే విషయంలో దంపతుల గొడవ

● భర్త దాడిలో భార్య మృతి

రాయచూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పొలం అమ్మే విషయంలో బుధవారం భార్యాభర్తల మధ్య తలెత్తిన తగాదా భార్య మృతికి దారి తీసింది. జిల్లాలోని సిరవార తాలూకా బొమ్మనాళ గ్రామానికి చెందిన హనుమంతరాయకు 10 ఎకరాల పొలం ఉండగా సాగు కోసం చేసిన అప్పు తీర్చేందుకు ఎకరం పొలం అమ్మేందుకు సిద్ధమయ్యాడు. దీన్ని వ్యతిరేకించిన భార్య బస్సమ్మ భర్తతో గొడవకు దిగింది. ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో చేతిలో ఉన్న పైప్‌తో భార్యపై దాడి చేయడంతో ఆమె తలకు బలమైన గాయమైంది. వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. విషయం తెలుసుకున్న సిరవార పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. హనుమంతరాయను పోలీసులు అరెస్టు చేశారు.

అంబేడ్కర్ భవన్‌కు రూ.3.5 కోట్ల గ్రాంటు



రాజ్యాంగ దినోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మంజునాథ్

ముళబాగిలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవరాయ సముద్ర గేట్ వద్ద ప్రభుత్వ గ్రాంటు రూ.2.5 కోట్లు, ఎమ్మెల్యే గ్రాంటు రూ.1 కోటి సహా మొత్తం రూ.3.5కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మాణానికి గ్రాంటు విడుదలైందని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ వెల్లడించారు. పట్టణంలోని నేతాజి క్రీడామైదానంలో బుధవారం ఏర్పాటైన జాతీయ రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. త్వరలోనే అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తామన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆధునీకరిస్తామన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి రాజ్యాంగమే కీలకమన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటాన్ని వెండిరథంపై ఊరేగిస్తూ మైదానానికి చేరుకుంది. రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ వీ గీత, తాలూకా పంచాయతీ ఈఓ రవీంద్ర, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రఘుపతిరెడ్డి, నగరసభ కమిషనర్ శ్రీధర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కే హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జయరాంకు ఆత్మీయ సన్మానం



జయరాంను సత్కరిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విశేష సేవలందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాజ్యోత్సవ అవార్డు 2025 అందుకున్న డాక్టర్ ఎంఆర్ జయరాంను ఆత్మీయంగా సత్కరించారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (మెడికల్) హానరబుల్ ఛైర్మన్, రామయ్య అప్లైడ్ సైన్సెస్ యూనివర్సిటీ చాన్సలర్‌గా డాక్టర్ ఎంఆర్ జయరాం కొనసాగుతున్నారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (మెడికల్), రామయ్య వర్సిటీ ముఖ్యులు ఘనంగా సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ పాల్గొన్నారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎంఆర్ సీతారాం, యూనివర్సిటీ వీసీ కేకే రైనా, రిజిస్ట్రార్ అశోక్‌రావ్, నాగేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై జాగృతి అభియాన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

శిడ్లఘట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాఠశాలల విద్యార్థులకు టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ప్రత్యేక జాగృతి అభియాన నిర్వహించారు. భారతరత్న అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తహసీల్దార్ పూర్ణిమా మాట్లాడుతూ రాజ్యాంగంలో 400కుపైగా ఆర్టికల్స్, 25 భాగాలు, 12 షెడ్యూల్స్ ఉన్నాయన్నారు. ఇవన్నీ కూడా 75 ఏళ్ల తర్వాత కూడా కాలానికి అనుగుణంగా పలు మార్పులు జరిగాయన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించారన్నారు. ప్రజాస్వామ్య దేశాలలో భారతదేశ రాజ్యాంగం ఎంతో విశిష్టమైనదన్నారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు.

వర్తూరులో కన్నడ రాజ్యోత్సవం



కన్నడ రాజ్యోత్సవంలో మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వర్తూరు మెయిన్‌రోడ్డులోని రక్షిత్‌బృందం ఆధ్వర్యంలో బుధవారం కన్నడ రాజ్యోత్సవం జరిగింది. ముఖ్యులుగా మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొని మాట్లాడుతూ నవంబరు నెల మొత్తం కన్నడమయం అయ్యేలా ఎటుచూసినా సాంస్కృతిక సంబరాలతో కన్నడ రాజ్యోత్సవం ఆచరిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. మన భాషా సంస్కృతుల ఔన్నత్యాన్ని చాటేలా కార్యక్రమాలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా పేదలకు నిత్యావసర కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోబళి పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డిచ రూరల్ అధ్యక్షుడు హెచ్ఎస్ పిళ్ళప్ప, ప్రముఖులు వర్తూరు శ్రీధర్, మహేంద్రమోది, పెద్దసంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల సాధన జిల్లాకు గర్వకారణం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి మారుతి బగాడె



మాట్లాడుతున్న మారుతి బగాడె

రాయచూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు రాష్ట్ర ప్రభుత్వం రాజ్యోత్సవ అవార్డు దక్కించుకున్న జిల్లావాసులు మనందరికి గర్వకారణమని జిల్లా ప్రధాన న్యాయాధికారి మారుతి బగాడె అన్నారు. 2025 రాజ్యోత్సవ అవార్డు అందుకున్న జిల్లా వాసి జాఫర్ మొహినుద్దీన్‌ను మంగళవారం సాయంత్రం నగరంలోని గాలిబ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మరో అవార్డు గ్రహీత రత్నమ్మ దేసాయి అనారోగ్య కారణంతో కార్యక్రమానికి రాలేకపోవడం వల్ల ఆహుతులు తమ విచారం వ్యక్తం చేశారు.

సిరుగుప్ప: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అన్ని వర్గాల అభివృద్ధికి సరిసమానంగా రాశారని ఎమ్మెల్యే బీఎం నాగరాజు అన్నారు. బుధవారం సిరుగుప్ప పట్టణం అంబేడ్కర్ సర్కిల్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ప్రధాన రహదారిలో ఊరేగించారు. హైస్కూలు గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ గౌసియా బేగమ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బీఎం సతీష్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొడ్లి మల్లికార్జున, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ మద్దేరు సిద్దయ్య, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, తాలుకా పంచాయతీ ఈవో పవన్ కుమార్ పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.21	1630.82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,654	4,076
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,205	6,929
నీటి నిల్వ (టీఎంసీలు)	73.94	97.18

అధిష్ఠానం చేతిలో సీఎం సిద్దరామయ్య భవితవ్యం

- ముఖ్యమంత్రిని ఉంచడమా.. దించడమా..?
- కాంగ్రెస్ కమిటీలో భిన్నాభిప్రాయాలు
- రికార్డు కొట్టాలని ప్రస్తుత సీఎం ప్రయత్నం
- మార్పు తేలేవరకు మంత్రివర్గ విస్తరణ ఉండదు



బళ్లారి, నవబంరు 26(ఆంధ్రజ్యోతి): సీఎం మార్పు ఒప్పందం కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటి వరకూ తేల్చలేకపోతుంది. ఢిల్లీలో కాంగ్రెస్ ఉన్నత కమిటీలో కూడా చర్చలు జరిగిన సమయంలో కమిటీలో కొందరు సభ్యులు కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారని ఆ పార్టీ వర్గాల సమాచారం. మంత్రివర్గ రీ-షఫలింగ్ అని కమిటీలో కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తే.. ఇంకొందరు ప్రస్తుత సీఎంను దించాలా.? అలాగే ఉంచాలా.? అని నిర్ణయించాలని అన్నట్లు సమాచారం. దీంతో మంత్రివర్గం రీ-షఫలింగ్ కూడా ముఖ్యమంత్రి మార్చిన తరువాత కొత్త మంత్రివర్గం ఏర్పడుతుందా లేదా అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండున్నరేళ్ల తరువాత సీఎంను మారుస్తారని అప్పట్లో కాంగ్రెస్ ఒప్పందం జరిగిందని ప్రచారం ఉంది. ఇందులో భాగంగానే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను మిగిలిన రెండున్నరేళ్లకు సీఎం చేయాలని కాంగ్రెస్ పెద్దలు మాట ఇచ్చారట. అయితే సీఎం సిద్దరామయ్య సీఎం పీఠం నుంచి దిగకముందే సీనియర్లు రేసులోకి వస్తున్నారు. జార్కిహొళి, హెచ్‌కే పాటిల్. కృష్ణబైరేగౌడ, పరమేశ్వర్ లాంటి పేర్లు కూడా ప్రచారంలోకి వస్తున్నాయి. సీఎం సిద్దరామయ్య కూడా తనకు కాకుంటే ఇంకొకరికి అన్నట్లు ఒకసారి ఎస్టీకి చెందిన జార్కిహొళి పేరు, మారోసారి ఎస్సీకి చెందిన పరమేశ్వర పేరు, వక్కలింగ సమాజంలో కృష్ణబైరేగౌడ పేరు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి మారడం ఖాయమని, ఎప్పుడు అనేది చెప్పలేమని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. మంత్రివర్గంలో స్థానం కోసం ఎదురుచూస్తున్న బి. నాగేంద్ర, టీకే హరిప్రసాద్ మరి కొందరు సీనియర్లు కూడా సీఎం మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల దాటితే వచ్చే నెల నుంచి మంచి రోజులు లేవు, ఇక జనవరి తరువాతే రాజకీయంగా పదవులు అలకరించేందుకు మంచి రోజులు, దీంతో సీఎం సిద్దరామయ్య కూడా ఈనెల దాటేస్తే తన పంతం నెగ్గుతుంది, రికార్డు కొట్టేస్తాను అనే అలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. డీకేశీ కూడా ఈ వారం రోజులే తాడోపేడో తేల్చుకోవాలి, లేదంటే జనవరి 14 వరకు మంచిరోజులు లేవని లెక్కలు వేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయమై సీఎం, డీసీఎంలు మంగళవారం ఢిల్లీకి పయనమయ్యారు.

కర్ణాటక రాజకీయాలపై కమలం ఫోకస్

బిహార్ ఎన్నికలు ముగిసిన తరువాత కమల దళం కూడా కర్ణాటక రాజకీయాలపై కన్నేసి ఉంచింది. బీజేపీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయులు, సీనియర్ కార్యకర్తలతో కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలపై కేంద్ర నాయకులు సమాచారం సేకరిస్తున్నారు. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలు గ్రూపులుగా విడిపోతే దాన్ని ఉపయోగించుకోవాలా.. వద్దా అనే అలోచనలో ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ సర్కారు రెండున్నరేళ్ల కాలం ముగిసింది. మరో రెండేళ్లు వేచిచూస్తే బీజేపీకి లాభం కలుగుతుందని కొందరు నాయకులు కేంద్ర నాయకులకు సమాచారమిచ్చారు. మరి కొందరు కాంగ్రెస్ గ్రూపులుగా మారి తమ వద్దకు వస్తే మనమే మద్దతు ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఏదేమైనాఆ ఇంత విచిత్ర రాజకీయం గ్రూపు రాజకీయాలు, కాంగ్రెస్‌కు నష్టం కలిగిస్తాయని కొందరు సీనియర్ నాయకులు అంటున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వెంకటరమణ ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కంప్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని బుక్కసాగర గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా ఏడుపడగల నాగప్పకు పురోహితులు విశ్వనాథస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని వెంకటరమణ ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తాత్కాలిక రిజిస్ట్రార్‌గా దినేష్



నియామకపత్రం అందుకుంటున్న దినేష్

బళ్లారి సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తాత్కాలిక రిజిస్ట్రార్‌గా మేనేజ్‌మెంట్ సైన్సెస్ విభాగం ప్రొఫెసర్ దినేష్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రిజిస్ట్రార్ నాగరాజు బదిలీ కావడంతో ఖాళీగా ఉన్న పోస్టును వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మునిరాజు దినేష్‌ను నియమించారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక



కాంగ్రెస్ పార్టీలోకి చేరిన భాస్కర్‌రెడ్డి, మహంతేష్

కంప్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కంప్లి సమీపంలోని నంబర్2 ముద్దాపురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, నన్నాపురం గ్రామానికి చెందిన మహంతేష్ బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. వారు బీజేపీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా జేఎన్ గణేష్ చేపట్టిన అభివృద్ధి పనులు గుర్తించి తాము కాంగ్రెస్‌లోకి చేరినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో పార్టీలో చేరడం సంతోషించతగ్గ విషయమన్నారు. ఎప్పటికీ మీవెంట నేనుంటానని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా గ్రామాలను మరింత బలోపేతం చేయాలన్నారు. వారితో పాటు షణ్ముఖప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలుగుబంటి పట్టివేత



ఎలుగు బంటిని బంధిస్తున్న అటవీశాఖ అధికారులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తోరణగల్లులోని జేఎస్‌డబ్ల్యూ టౌన్‌షిప్‌లో కొన్నిరోజులుగా సంచరిస్తున్న ఎలుగుబంటిని ఎట్టకేలకు మంగళవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. బెంగళూరులోని వన్యజీవి సంరక్షణ అధికారుల అనుమతి మేరకు బళ్ళారి ఉప విభాగం అసిస్టెంట్ అటవీ సంరక్షణాధికారి, సండూరు పశు వైద్యాధికారుల సమక్షంలో మత్తు మందు ఇచ్చి పట్టుకున్నారు. పట్టుకున్న ఎలుగబంటిని బన్నేరుగట్ట వన్యజీవి సంరక్షణా కేంద్రం సహకారంతో జీపీఎస్ ఆధారితరేడియో కాలర్ ఐడీ ఏర్పాటు చేసి అటవీ ప్రాంతంలో వదిలినట్లు అధికారులు తెలిపారు.

రాజ్యాంగం.. దేశానికి గుండె లాంటిది

- లిడ్‌కర్ అధ్యక్షుడు ముండరగి నాగరాజు



ప్రతిజ్ఞ చేస్తున్న నాగరాజు, కలెక్టర్ నాగేంద్రప్రసాద్, ఎస్పీ శోభారాణి, సీఈఓ

బళ్లారి గాంధీనగర్/సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం మన దేశానికి గుండెలాంటిదని, రాజ్యాంగ్యంలోని అంశాలను ఎవరు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసినా దేశ గౌరవానికి భంగం వాటిల్లే ప్రమాదం ఉందని లిడ్‌కర్ అధ్యక్షులు ముండరిగి నాగరాజు అన్నారు. జిల్లా పాలనా మండలి, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని మహర్షి వాల్మీకి భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత దేశం వైవిద్యతతో కూడిన దేశమని, భారతీయ రాజ్యాంగం రచించడం అంత సులభం కాలేదని, అన్ని ధర్మాలను, నమ్మకాలను, జాతులు, సిద్దాంతాలతో ప్రజలను ఒక్కటి చేయడం చాలా కష్టసాధ్యమైందన్నారు. రాజ్యాంగాన్ని రాసేటప్పుడు సామన్యుల జీవనాన్ని సంరక్షించడానికి అవసరమైన తత్వాలను చేర్చి, రాజ్యాంగాన్ని తీసుకు రావడానికి సాధ్యమైందన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదగడానికి పిల్లల్లో రాజ్యాంగం పట్ల అవగాహన తీసుకురావాలని పిలుపినిచ్చారు. అనంతరం జిల్లాధికారి కె.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలని, తద్వారా భవిష్త్‌లో వారి జీవితంలో రాజ్యాంగం ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. ప్రపంచంలో అతి పెద్ద రాజ్యాంగాన్ని అంబేద్కర్ భారతీయులకు ఇచ్చారని, రాజ్యాంగాన్ని రచించడానికి అనేకమంది శ్రమించారన్నారు. బాబాసాహెబ్ రాజ్యాంగ రచనా సమితికి అధ్యక్షత వహించి ప్రపంచంలో అన్ని దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. ఇదే సందర్భంలో జిల్లా పంచాయతీ సీఈఓ మహ్మద్ హారీస్ సుమేర్ మాట్లాడారు. కార్యక్రమంలో గంగావతికి చెందిన ఎస్‌కేఎన్‌జీ ప్రభుత్వ డిగ్రీకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫణిరాజ్ రాజ్యాంగం గురించి ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. జిల్లాఎస్పీ శోభారాణి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చిదానంద, ఎస్సీ వర్గాల సంక్షేమ అధికారి శాసు మోదీన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి జలాలప్ప, తహసీల్దారు రేఖ, సఫాయి కర్మచారి జిల్లా స్థాయి సమితి సభ్యులు కందుకూరి రాముడు, ప్రముఖులు మానయ్య, ఎల్. మారెణ్ణ, డి.వెంకమ్మ, కమలా మరిస్వామి, బౌద్ధ ధర్మగురువు కమలరత్నలతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు జిల్లాధికారి కార్యాలయం నుంచి సైకిల్ ర్యాలీని ప్రారంభించిన జిల్లాధికారి నాగేంద్ర ప్రసాద్, జడ్పీ సీఈఓ, మేయర్ సైకిల్ తొక్కుతూ ర్యాలీని ప్రారంభించారు.

రాజ్యాంగం దేశానికి దీపస్తంభం: ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి

గంగావతి రూరల్ (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం దేశానికి దీపస్తంభమని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. గంగావతి పట్టణంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్, ఐఎంఏ హాల్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన అందరితో కలిసి రాజ్యాంగం ప్రవేశికను గౌరవంగా చదివారు. అయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి బాసటగా నిలిచిన భారత రాజ్యాంగం శాశ్వతమైన దీపస్తంభం, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛల కోసం ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో అసాధారణ పాత్ర పోషించిన అంబేద్కర్ అపారమైన సహకారాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. తహసీల్దార్ యు.నాగరాజు, కార్యనిర్వాహక అధికారి రాంరెడ్డి పాటిల్, మున్సిపల్ కమిషనర్ విరూపాక్ష మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ హులిగప్ప, ఫీల్డ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హెచ్‌బీ నటేష్ పాల్గొన్నారు.

కంప్లి(ఆంధ్రజ్యోతి): కంప్లి, కురుగోడు తాలుకాల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కంప్లి పట్టణంలో రెవెన్యూ, అంగన్‌వాడీ, ఆరోగ్య శిక్షణ పురసభ, సాంఘిక సంక్షేమ శాఖ, సంఘం సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం పట్టణంలో అంబేద్కర్ భావచిత్రపటంను ఊరేగించారు. కురుగోడులో తహసీల్దార్ మంజునాథ్ నాయక్, నరసప్ప, ఈవో శ్రీకుమార్, షణ్ముఖప్ప, మల్లేశప్ప, వివిధ శాఖల అధికారుల సంఘం సంస్థల నాయకులలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.



హొస్పేటలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి



కంప్లిలో..

పల్స్ పోలియోపై విస్తృత ప్రచారం చేయాలి: డీహెచ్‌ఓ



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ డాక్టర్ రమేష్ బాబు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా డిసెంబరు 21న నిర్వహించే పల్స్‌పోలియోపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని డీహెచ్‌ఓ రమేష్‌బాబు అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ కంక్షేమ శాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సహాయంతో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సభాంగణంలో జిల్లా, తాలూకా విభాగం స్థాయి పరిశీలకులకు పల్స్‌పోలియో నిర్వహణపై బుధవారం ఒక రోజు జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలే ఆరోగ్య శాఖ సిబ్బంది పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. 2011 జనవరి 13న దేశంలో పోలియో ఆఖరి కేసుగా నమోదు అయిందని, అనంతరం ఇప్పటి వరకు నిరంతరం పిల్లలకు పోలియో చుక్కలు వేయడం ద్వారా సుమారు 14 సంవత్సరాల పాటు ఒక్క పోలియో కేసు నమోదు కాలేదన్నారు. దీనిని అలాగే ఉంచాలంటే ప్రతి ఐదేళ్ల చిన్నారికి కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాల్సిందేనన్నారు. అనంతరం ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప మాట్లాడుతూ జిల్లాలో అన్ని తాలూకా వసతి ప్రాంతాల్లోనూ, వలస ప్రాంతాల్లో, కట్టడ నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లోను, మురికివాడల్లో, తోటల్లో, క్యాంపులు, నగరంలోని అపార్ట్‌మెంట్లల్లో నివసించే ప్రాంతాల్లో పిల్లల జాబితాను సిద్ధం చేసుకుని తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్జన్ డాక్టర్ ఎన్.బసారెడ్డి, డాక్టర్ ఆర్.అబ్దుల్లా, తాలూకా ఆరోగ్యధికారులు డాక్టర్ బసవరాజు, డాక్టర్ అరుణ్, డాక్టర్ మంజునాథ్‌లతో పాటు జిల్లా, తాలూకా, క్షేత్ర స్థాయి పరిశీలకులు పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి కేజీ శాంతి

స్త్రీ, పురుషులు గౌరవభావంతో మెలగాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కేజీ శాంతి

బళ్లారి గాంధీనగర్, నవంబరు 26(ఆన్‌లైన్): స్త్రీ, పురుషులు పరస్పరం గౌరవభావంతో మెగాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి కేజీ శాంతి అన్నారు. జిల్లా చట్టసేవ ప్రాధికార, జిల్లా న్యాయంగ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తాళూరు రోడ్డులో ఉన్న నూతన కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన మహిళలపై దౌర్జన్యాలు - నిర్మూలన కార్యక్రమంలో చట్టం పట్ల అవగాహన కార్యాక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్త్రీ, పురుషులు గౌరవభావంతో మెలగాలని, అప్పుడే మహిళల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మహిళలపై దౌర్జన్య నిర్మూలనా చట్టం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాది శివలీల మాట్లాడుతూ 10మంది కిపైగా పనిచేసే ప్రాంతాల్లో మహిళల అంతర్గత ఫిర్యాదుల సమితి ఉండాలని, దైహికంగా, మానసికంగా ఎలాంటి దౌర్జన్యాలు జరిగినా మూడు నెలల్లోగా సమితికి ఫిర్యాదు చేయాలన్నారు. రాష్ట్ర చట్టసేవ పాధ్రికార, పేద ప్రజల సేవలకు సంబంధించి వీడియోను ప్రదర్శించారు. జిల్లా చట్టసేవ ప్రాధికార సభ్యుడు, సెక్రటరీ, సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమనె, న్యాయమూర్తులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి జీవికి నీరు అవసరం: శివకుమార్ స్వామి



చేళ్ళగుర్కి, చెరువువద్ద స్వామీజీలు, ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ భూమిపై పుట్టిన ప్రతి జీవికి నీరు అవసరమని, అలాంటి అమూల్యమైన నీటిని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నందివేర సంస్థాన మఠం స్వామీజీ శివకుమార్ మహాస్వాములు పిలుపునిచ్చారు. శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి పథకంలో భాగంగా పీడీ హళ్ళి పరిధిలోని చేళ్ళగుర్కి ఎర్రితాత ట్రస్టుకు చెందిన నాలుగు ఎకరాల్లో బహుగ్రామ తాగునీటి పథకం కింద నిర్మించిన చెరువులో పేరుకుపోయిన పూడికను రూ.10లక్షల ఖర్చు చేసి తొలగించారు. ధర్మస్థల అధ్యక్షుడు డాక్టర్ వీరేంద్ర హెగడే పుట్టిన రోజును పురస్కరించుకుని బళ్ళారి తాలూకా పరిధిలోని చేళ్లగుర్కి చెరువును చేళ్ళగుర్కి అభివృద్ధి సమితికి అప్పగించారు. కమ్మరచేడు కల్యాణమఠానికి చెందిన కల్యాణస్వామి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వనరులైన చెరువులను సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్మస్థల గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ రోహితాక్ష మాట్లాడుతూ డాక్టర్ విరేంద్ర హెగడే ఆధ్వర్యంలో జల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా నమ్మూరు నమ్మ కెరె కార్యక్రమంలో చెరువులో పేరుకు పోయిన పూడికతీత బృహత్తర కార్యాక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 900 చెరువులకుపైగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఒక ఏడాదిలో వెయ్యి చెరువులకు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు సిద్దలింగనగౌడతో పాటు కోశాధికారి సిద్దనగౌడ, క్షేత సంయోజకులు బసవరాజు, సీకే పంపగౌడ, ఇంజనీర్ సతీష్, క్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

హత్యకేసు ఛేదింపు.. నిందితుడి అరెస్టు



నిందితుడు సతీష్(బ్లూ కలర్ జీన్స్)ను అరెస్టు చేసిన పోలీసులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బళ్లారి అభివృద్ధి ప్రాధికార(బుడా) వాణిజ్య సంకీర్ణ కట్టడంలో గుర్తు తెలియని యువకుడి హత్య కేసును ఏపీఎంసీ పోలీసులు ఛేదించి, నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ శోభారాణి తెలిపారు. హత్యకు గురైన యువకుడు ఆంధ్రాల్ ప్రాంతానికి చెందిన శివ(25)గా పోలీసులు గుర్తించగా, హత్యకు కారకుడైన వ్యక్తి ఎం.అతేశ అలియాస్ సతీష్(19)గా నిర్ధారించారు. ఇందుకు సంబంధించి ఎస్పీ తెలిపిన మేరకు 18న బుడా సంకీర్ణ ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని పోలీసులు గుర్తించారు. ఏపీఎంసీ పోలీసులు కేసు నమోదు చేసుకోగా, హత్యకు కారుకులైన వారిని గుర్తించేందుకు ఎస్పీ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు సతీష్, మృతుడు శివ ఇద్దరూ కనిపించారు. ఈ ఫుటేజ్ ఆధారంగా నిందితడు సతీశ్‌ను స్థానిక రేణుకా హోటల్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసుల విచారణలో శివను తానే హత్యచేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు వివరించారు. మృతుడు శివ, నిందితుడు సతీష్ ఇద్దరు గుజరీ సామన్లు సేకరించి అమ్ముతూ జీవనం సాగించేవారు 17వ తేదీన ఇద్దరికి అల్యూమినియం ఫ్రేం లభించడంలో దానిని గుజరీకి రూ.1500లకు అమ్మారు. వచ్చిన దానిలో శివకు సతీష్ కేవలం రూ.300 ఇచ్చాడు. దీంతో వారిద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. అదే రోజు సాయంత్రం బుడా సంకీర్ణ ప్రాంగణంలో తాగడానికి ఇద్దరు వచ్చిన సమయంలో కోపంలో సతీష్ శివ తలపై బీర్ బాటిల్‌తో కొట్టి, అనంతరం పైనుంచి తోసినట్లు తెలిపారు.బుడా కాంప్లెక్‌లో రాత్రివేళ అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయంపై బుడా అధికారులు, అధ్యక్షులతో చర్చించి కాంప్లెక్స్ చుట్టూ సీసీ కెమరాలుఏర్పాటు చేయాలని సూచించినట్లు ఎస్పీ తెలిపారు.

చిన్నారులలో ప్రతిభను వెలికి తీయాలి

బళ్లారి గాంధీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో దాగివున్న కళా ప్రతిను వెలికితీయాలని జగ్జీవన్ రామ్ చర్మ పరిశ్రమ అభివృద్ధి మండలి అధ్యక్షుడు ముండరిగి నాగరాజు అన్నారు. బుధవారం కన్నడ సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ జోళదరా దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కళా ప్రతిభోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళారంగంలో సాధన చేసిన కళాకారులు బెళగల్ వీరణ్ణ, జోళదరాసి దొడ్డనగౌడ, సుభద్రమ్మ మన్సూర్, బళ్ళారి రాఘవ లాంటి ఎంతోమంది కళాకారులు జిల్లాకు అపురూపమైన కళాసేవలు అందించారని అన్నారు. అలాంటి ప్రతిభ కళాకారులు తమ కళలను ప్రదర్శించేందుకు ఇలాంటి కార్యక్రమాలు వేదికగా నిలుస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఎన్నో పథకాలు రూపొందించిందని, వాటిని కళాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యమ్రంలో సిటీ కార్పొరేషన్ మేయర్ పి.గాదెప్ప మాట్లాడుతూ పిల్లల్లో దాగివున్న ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కార్యక్రమాలు వేదికగా నిలుస్తాయన్నారు. అనంతరం నిర్వహించిన జానపద నృత్యకార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కన్నడ సంస్కృతి శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ చోరనూరు కొట్రప్ప, గాయకులు యల్లనగౌడ సీనియర్ పిటీల్ వాదకులు శకుంతమ్మ, కళాకారులు జాధవ్, అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



కళాప్రతిభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

హోసూరు జోన్

'లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి'



నిరసనలో వివిధ సంఘాల నాయకులు

హోసూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జారీ చేసిన నూతన లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అన్ని కార్మిక సంఘాలు నిరసన తెలిపారు. హోసూరులోని రాంనగర్‌లోని అన్నా విగ్రహం దగ్గర బుధవారం నిరసన తెలిపారు. నిరసనకు ఎల్‌బీఎఫ్ జిల్లా కౌన్సిల్ కార్యదర్శి గోపాలకృష్ణన్ నాయకత్వం వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాధయన్, సిహెచ్‌డీయూ జిల్లా కార్యదర్శి శ్రీధర్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజు పాల్గొన్నారు. కార్మికులు గెలుచుకున్న హక్కులు, హక్కులను హరించేవిధంగా కార్మిక సవరణ బిల్లు ఉందని ఆరోపించారు. ఈనెల 11న జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రైతులు పండిస్తున్న పంటలకు కనీస మద్దతుధర నిర్ణయించాలన్నారు. సామాజిక భద్రతను నిర్ధారించాలన్నారు. మహిళలను ప్రమాదకరమైన ఉద్యోగాలలో ఉంచే కర్మాగార చట్టానికి సవరణను ఉపసంహరించాలన్నారు. నిరసనలో ఎల్‌పిఎఫ్ కృష్ణన్, సీఐటీ.యూ గోవిందమ్మాళ్, ఏఐటీయూసీ.శంకరయ్య, ఐఎన్‌టీయూసీ భక్తవత్సలం, కృష్ణమూర్తి, సెందిల్, సీ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి: కలెక్టర్



ప్రభుత్వం తరపున విద్యారుణం అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న విద్యారుణాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని విద్యార్థులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. కృష్ణగిరి జిల్లాలో 92 మంది లబ్ధిదారులకు రూ.8.30 కోట్ల విలువైన విద్యారుణం అందించినట్లు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం జిల్లా కమిటీ బ్యాంకు, అన్ని బ్యాంకులు సంయుక్తంగా హోసురులో నిర్వహించిన గ్రాండ్ ఎడ్యుకేషన్ లోన్ క్యాంప్‌ను కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య పాల్గొన్నారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ అక్టోబరు 9న కృష్ణగిరి జిల్లాలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యారుణ శిబిరం ద్వారా 35 మంది విద్యార్థులకు రూ.3 కోట్ల 41 లక్షల విలువైన విద్యారుణాలు అందించామన్నారు. తరువాత బుధవారం కృష్ణగిరి జిల్లా, పొరుగు జిల్లాలో నివాసితులు కృష్ణగిరి జిల్లాలో చదువుతున్న వారికి ప్రయోజనం కల్పించేందుకు అన్ని బ్యాంకుల జిల్లా అధికారులు సంయుక్తంగా గొప్ప విద్యారుణ శిబిరాన్ని నిర్వహించాయి. ఇండియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ధనలక్ష్మీ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర బ్యాంకు మేనేజర్లు శిబిరంలో పాల్గొన్నారు. ప్రస్తుత శిబిరంలో 37 మంది కళాశాల విద్యార్థులకు రూ.3.65 కోట్ల రుణాలు అందచేశారు. విద్యాలక్ష్మి పోర్టల్‌లో విద్యా రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యా రుణ సహాయం పొందడానికి జిల్లా కలెక్టర్ వ్యక్తిగత సహయకుడు సర్దార్ మొబైల్ నెంబర్ 9443136918 ని సంప్రదించి సమాచారం అందిస్తే తగిన సలహాసూచనలు చేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ఆనందయ్య, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశన్, సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజాముత్తయ్య, ఆర్థిక విద్యా కేంద్రం సలహాదారు పూస్వామి, తాలూకా అధికారి గుణశివ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

హోసూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని రాష్ట్ర సరిహద్దు సమీపంలో ఓమ్ని బస్సులో అక్రమంగా తరలిస్తున్న 8 కిలోల గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకుని యువకుడిని అరెస్టు చేశారు. సరిహద్దులోని జూజూవాడీ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బెంగళూరు నుంచి హోసూరు వైపు వస్తున్న ఓమ్నిలో సోదాలు చేశారు. 8.950 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న గుర్తించారు. నిందితుడు దిండిగల్ జిల్లా ఆత్తూరు సమీపంలోని చందమనాయకనపట్టి గ్రామానికి చెందిన ధర్మరాజు (25)గా గుర్తించారు. బెంగళూరు నుంచి అవినాషి ప్రాంతానికి గంజాయిని అక్రమంగా రవాణా చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు అతడిని అరెస్టు చేసి గంజాయిని స్వాదీనం చేసుకుని ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డివిజన్ పోలీసులకు అప్పగించారు.